క్లుప్తంగా

విధుల్లో కానిస్టేబుళ్ల చేరిక



దుగ్గొండి : తాజాగా శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు నాగభవానీ, ప్రభాతరత్న, శిరీష, సాయికుమార్, రాజు, వేణు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, సిబ్బంది ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. ప్రజలకు న్యాయం చేసే, రక్షణ కల్పించే అవకాశం పోలీసులకు మాత్రమే ఉంటుందని చెప్పారు. కానిస్టేబుళ్లుగా బాధితులకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి చేయండి



రాయపర్తి : రాష్ట్రంలోని గిరి జనుల అభివృద్ధికి కృషి చేయాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మండలంలోని జయరాంతండా(కే)కు చెందిన కాంగ్రెస్ నాయకుడు మోహన్‌నాయక్ కోరారు. ఆయన మంత్రిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. అనంతరం గిరిజనుల పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ బలోపేతం దిశగా పని చేస్తామన్నారు.

సన్మానం



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో క్యాషియర్‌గా విధులు నిర్వహించి రఘునాథ్‌పల్లికి బదిలీ అయిన సందర్భంగా నవనీత్ చారిని మేనేజర్ మోహన్‌కాంత్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీ సహజమన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కట్టస్వామి, ఉద్యోగులు శిరీష, దేవేందర్, వీరాచారి, రాజు, శివ పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ చైర్మన్ నియామకంపై హర్షం


నెక్కొండ : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని జనగామ జిల్లా ఓబుల్ కేశ్వాపూర్‌కు చెందిన బుర్రా వెంకటేశంను టీజీపీఎస్సీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంపై సర్దార్ సర్వాయి పాపన్న మోకుదెబ్బ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు కారింగుల సురేశ్ మాట్లాడారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ అధికారిగా గుర్తింపు పొందిన వెంకటేశంను టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కక్కెర్ల రాధిక, రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, నెక్కొండ గౌడ సంఘం అధ్యక్షుడు కక్కెర్ల నాగయ్య, నాయకులు గడ్డం ఆనందం, కదురు సాంబయ్య, జగన్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుడు బాల్నె సతీశ్‌కు ఆదివారం రూ.52 వేల సాయం అందజేశారు. సతీశ్ కొంత కాలంగా అంతుచిక్కని వ్యాధి బారిన పడి నడవ లేని స్థితిలో వీల్ చైర్‌కు పరిమితమయ్యాడు. వైద్యం కోసం ఇప్పటికే సుమారు రూ.5 లక్షల అప్పు చేశాడని తెలిసి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. సతీశ్‌కు ప్రభుత్వమే వైద్యం చేయించి ఆదుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.

బియ్యం అందజేత



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన వజ్జంతి రాజేంద్రచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి రాజేంద్రచారి చిన్ననాటి మిత్రులు ఆదివారం 125 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత రాజేంద్రచారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పెరుగుతున్న చలి

- రైతులు, కూలీలకు తీవ్ర ఇబ్బందులు
- వ్యాధులతో చిన్నారుల, వృద్ధుల వెతలు



నర్సంపేటలోని మల్లంపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన స్వెటర్లు, రగ్గుల దుకాణాలు

నర్సంపేట : జిల్లాలో చలి తీవ్రత నానాటికీ పెరుగుతోంది. సుమారు వారం, 10 రోజులుగా ఉష్ణోగ్రత పడిపోవడంతో చలిగాలులు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. పగటి, రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో తెల్లవారుజామునే పనులకు వెళ్లే కూలీలు, రైతులు వణికిపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. చిరుజల్లులతోపాటు చలి గాలులు వీస్తుండడంతో ఉష్ణోగ్రత మరింతగా పడిపోతోంది. సాయంత్రం తర్వాత చలి పెరుగుతుండడంతో ప్రజలు, వాహనదారులు గజగజా వణుకుతున్నారు. జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట, గీసుకొండ, సంగెం, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల్లో తెల్లవారుజామునే పొగమంచు కమ్మేస్తోంది. రోడ్లు సరిగా కనిపించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాకింగ్‌కు, జిమ్‌కు సాయంత్రం వేళల్లోనే వెళ్తున్న పరిస్థితి కనపడుతోంది.

అనారోగ్య పరిస్థితులు

వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు దగ్గు, జలుబు, జ్వరం, తలనొప్పి, శ్వాసకోశ, చర్మ వ్యాధుల బారిన పడి సతమతమవుతున్నారు. చలి తీవ్రత నేపథ్యంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కొందరు చలి మంటలు వేసుకుని సాంత్వన పొందుతున్నారు.

ఉన్ని దుస్తులకు గిరాకీ...

జిల్లాలో చలి తీవ్రత నేపథ్యంలో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగిపోయింది. నర్సంపేటలోని వరంగల్, మల్లంపల్లి, నెక్కొండ, మహబూబాబాద్ రోడ్లలో స్వెటర్లు, రగ్గుల దుకాణాలు ఏర్పాటు చేశారు. మంకీ క్యాప్‌లు, చేతి గ్లౌజులు, జర్కిన్లు, దుప్పట్లు, రగ్గులు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడే ఇలా ఉంటే జనవరి, ఫిబ్రవరి నెలల్లో చలి తీవ్రత ఇంకెలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



వృద్ధులు, చిన్నారులు చలి ఎక్కువగా ఉన్న సమయంలో స్వెటర్లు ధరించాలి. గోరు వెచ్చటి నీటినే తాగాలి. సూర్యుడు ఉదయించాకే పనులకు బయటకు వెళ్లాలి. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయించాలి. చలికాలంలో చర్మవ్యాధులతో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి. చలికి రక్తం గడ్డ కట్టే అవకాశం ఉంది. చలికి చర్మం ముడుచుకుపోకుండా కోల్డ్ క్రీమ్స్, వ్యాజిలెన్ లాంటివి రాసుకోవాలి. అలర్జీ, ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఎక్కువ. శ్వాసకోస వ్యాధులు ప్రబలే పరిస్థితి కనపడుతోంది. ఆస్తమాతో బాధపడుతున్న ప్రజలు దుమ్ముధూళి వంటి వాటికి దూరంగా ఉండాలి. వాకర్లు చలిలో వాకింగ్ చేస్తే శ్వాసకోస సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. సూర్యోదయం అయ్యాకే వాకింగ్‌కు వెళ్లాలి. గుండె జబ్బులతో బాధపడుతున్న ప్రజలు ఎండ వచ్చాకే వాకింగ్ చేయాలి.

– డాక్టర్ జయిడు, జనరల్ సర్జన్, నర్సంపేట

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ



నర్సంపేట : మాట్లాడుతున్న డాక్టర్ జయుడు

నర్సంపేట : అవగాహన పెంచుకోవడం ద్వారా ఎయిడ్స్ నివారణకు బాటలు వేయాలని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎం.జయుడు ఆకాంక్షించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఐఎంఏ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిర్వహించిన ర్యాలీలో డాక్టర్ జయుడు పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్‌పై సమాజంలోని ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజాచైతన్యంలో యువత, ఉద్యోగులు, మేధావులు భాగస్వాములు కావాలని కోరారు. తప్పు చేయకున్నా ఎయిడ్స్ బారిన పడ్డ వారూ ఉన్నారని తెలిపారు. ఎయిడ్స్ బాధితుల పట్ల సమాజం స్వాంతన కలిగించేలా వ్యవహరించాలని చెప్పారు. రక్తమార్పిడి వల్ల కూడా ఎయిడ్స్ సోకే అవకాశం ఉందన్నారు. శరీరంలో మార్పులను గమనిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన వైద్యపరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ భారతి, డాక్టర్లు నవత, సుజాతా రాణి, ఉజ్వల, శీతల్, మోహన్ రావు, గోపాల్, ఉదయ్‌సింగ్, మనోజ్‌లాల్, రవికృష్ణ, ప్రమోద్, వరంగల్ రోడ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారావు, అంగన్‌వాడీ టీచర్లు నల్ల భారతి, బత్తిని శిరీశ, రమాదేవి, వాణి, సరోజన, సబిత, పద్మ, సునీత, సరస్వతి పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు సరోజ మాట్లాడారు. ఎయిడ్స్ సోకిన వ్యక్తి నుంచి రక్తం ద్వారా, సిరంజిల ద్వారా ఇతరులకు వ్యాధి సంక్రమించే అవకాశం ఉందన్నారు. ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం వ్యాధి నివారణకు కృషి చేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భద్రయ్య, స్టాఫ్ నర్స్ హేమలత, కేజీబీవీ ఉపాధ్యాయురాలు కవిత, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



నర్సంపేట : అన్నదానాన్ని ప్రారంభిస్తున్న రజిత రమేశ్, తదితరులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకులు శివ, తివారి అయ్యప్పస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 మెట్లపై జ్యోతి వెలిగిస్తూ స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో తుమ్మ రజిత రమేశ్, సాయికిరణ్, ముదుగుల భవ్య, నరేశ్, దర్శన్ సాయి, శేషగిరిరావు, శేషాందమ్మ, బ్రాహ్మణపల్లి సునీత సుమన్, మంచినీళ్ల సరోజన సోమయ్య, భార్గవకృష్ణ, మదనపల్లి రమాదేవి సత్యనారాయణ, కొండపర్తి రమ్యకృష్ణ రవికుమార్, బైరబోయిన రాణి అయిరేశ్ అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా మాట్లాడారు. నేడు (సోమవారం) ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న పుష్పాభిషేకం, దివ్య పడి పూజకు అయ్యప్పస్వాములు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, సభ్యులు మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మినారాయణ, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, పాలకుర్తి శ్రీను, వజినపల్లి శ్రీనివాస్, శింగిరికొండ వేణుగోపాల్, పిన్న రామనాథం, ఆకుల ప్రభాకర్, శ్రీరాం కిరణ్, బండారుపల్లి చెంచారావు, భరత్, కపిల్‌స్వామిగౌడ్, రావుల సతీశ్, గిరగాని దుర్గేశ్, తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

మహాపడిపూజ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలో కన్నె స్వాములు పోలెబోయిన ధినేశ్ చంద్ర, సంపత్ అయ్యప్ప దీక్షలు స్వీకరించిన సందర్భంగా పోలెబోయిన శ్రీను పడిపూజ నిర్వహించారు. అయ్యప్పను పూజించారు. భక్తి పాటలతో హోరెత్తించారు. అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురస్వాములు సాయి, పర్ష రాజు, నాయిని భరత్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా పోటీలు



రాయపర్తి : మాట్లాడుతున్న సెక్రటరీ కృష్ణమూర్తి



నర్సంపేట రూరల్ : విద్యార్థులతో ఎంఈఓ

- డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి

సాక్షి నెట్‌వర్క్ : విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసినట్టు డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి తెలిపారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, చెన్నారావుపేట, నెక్కొండ, దుగ్గొండి, ఖానాపురం, సంగెం, తదితర మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు 'నేనే సీఎం అయితే..' అంశంపై, 5, 6, 7వ తరగతుల విద్యార్థులకు 'దేశాభివృద్ధిలో రైతుల పాత్ర' అంశంపై ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, సంబంధిత ఎంఈఓలు నోముల రంగయ్య, కొర్ర సారయ్య, శ్రీధర్, లింగారెడ్డి, సరళ, రత్నమాల, శ్రీదేవి, రాము, వెంకటేశ్వర్లు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం కృష్ణమూర్తి, ఎంఈఓలు మాట్లాడారు. ప్రతిభావంతులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు.

కాపులకనిపర్తికి మోదం, చింతలపల్లికి ఖేదం

- చింతలపల్లి సొసైటీలో అమలు కాని దుస్థితి

సంగెం : నాల్గో విడత రైతు రుణమాఫీలో మండలంలోని కాపులకనిపర్తి సొసైటీ రైతులకు మోదం, చింతలపల్లి సొసైటీ రైతులకు ఖేదం ఎదురైంది. సాంకేతిక కారణాలతో మూడు విడతల్లోను రెండు సొసైటీల పరిధిలో ఒక రైతుకు కూడా రుణమాఫీ వర్తించని విషయం తెలిసింది. తాజాగా నాల్గో విడత రుణమాఫీ మంజూరైంది. కాపులకనిపర్తి సొసైటీ పరిధిలోని కాపులకనిపర్తి, ఆశాలపల్లి, కాట్రపల్లి, వెంకటాపూర్, గవిచర్ల, రామచంద్రాపురం, లోహిత, పెద్దతండా, షాపూర్, తీగరాజుపల్లి, సోమ్లాతండాతోపాటు వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామ పరిధిలోని 1907 మంది రైతులు మొత్తం రూ.15.60 కోట్ల రుణం పొందారు. అలాగే చింతలపల్లి సొసైటీ పరిధిలోని చింతలపల్లి, కృష్ణానగర్, కుంటపల్లి తదితర గ్రామాలకు చెందిన 644 మంది రైతులు సుమారు రూ.3 కోట్ల రుణం తీసుకున్నారు. మూడు విడతల్లోనూ రెండు సొసైటీల పరిధిలోని రైతులకు లబ్ధి చేకూరక పోవడంతో నిత్యం సొసైటీల చుట్టూ ప్రదక్షిణ చేయడం కనిపించింది. కాగా నాలోగ విడత జాబితాలో కాపులకనిపర్తి సొసైటీ పరిధిలోని 1151 మంది రైతులకు లబ్ధి చేకూరింది. చింతలపల్లి సొసైటీ పరిధిలో 644 మంది రైతులు ఎదురు చూస్తుండగా ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. చింతలపల్లి సొసైటీలో ఇటీవల రూ.44 లక్షల 87 వేల 912 మేర అవినీతి జరిగినట్లు అధికారులు తేల్చిన క్రమంలో పాలకవర్గం, సీఈఓ నిర్లక్ష్యం వల్లే తమకు రుణమాఫీ జరగలేదని పలువురు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రాజ్యాంగంపై విద్యార్థుల్లో చైతన్యమే ధ్యేయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు

- అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పర్వతగిరి : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని భారత రాజ్యాంగంపై విద్యార్థుల్లో చైతన్యం నింపడమే ధ్యేయంగా ఈనెల 5న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఈనెల 5న మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో «భారత రాజ్యాంగం–విశిష్టత, దేశ పరిరక్షణలో రాజ్యాంగం పాత్ర» అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించనున్నట్టు అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు వ్యాసరచన పోటీల కరపత్రాలను మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆంగ్ల, తెలుగు మాధ్యమ విద్యార్థులకు పోటీలు వేర్వేరుగా నిర్వహిస్తామని చెప్పారు. అన్ని పాఠశాలల నుంచి తెలుగు, ఆంగ్ల మాధ్యమాల నుంచి ఒకరు లేదా ఇద్దరు చొప్పున విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5 వేల 16తోపాటు మెమొంటో, ద్వితీయ బహుమతి రూ.3 వేల 16తోపాటు మెమొంటో, తృతీయ బహుమతిగా రూ.2 వేల 16తోపాటు మెమొంటో, కన్సోలేషన్ బహుమతిగా ఒక్కరికి చొప్పున రూ.వెయ్యి 16 నగదుతోపాటు మెమొంటో ఇద్దరికి ఇస్తామని వివరించారు. ఇతర వివరాల కోసం అర్షం దర్గస్వామిని సెల్ నంబర్ 9440248782లో, బొట్ల కనకరాజును 9704217655లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, ఎంఈఓ గాయపు లింగారెడ్డి, ప్రిన్సిపాల్ పాక రమేశ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కూసం రామచంద్రు, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు జిల్లా ధర్మయ్య, దర్గస్వామి, కనకరాజు, జక్కి గోపాల్, హ్యూమన్ రైట్స్ కమిషన్ మండల అధ్యక్షుడు జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

వర్ధన్నపేట : విద్యుత్ స్తంభాల ఏర్పాటు క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణ పరిధిలోని డీసీ తండాకు చెందిన భూక్యా గణేశ్ (26) విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటు పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో పాలకుర్తి మండలంలోని జేతునూరులో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కూలీగా వెళ్లి నవంబర్ 28న ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆయన్ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అవార్డుల ప్రదానం



వర్ధన్నపేట : ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనకు విశేష కృషిచేసిన ఐసీటీసీ మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్, కౌన్సిలర్ నీలారపు అశోక్ కుమార్ అవార్డులు అందుకున్నారు. ఆదివారం వరంగల్ ఐఎంఏ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారద, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు వారికి అవార్డులు ప్రదానం చేశారు. కరోనా సమయంలో హెచ్ఐవీ బాధితులకు చికిత్స అందించారు. 20 సంవత్సరాలుగా ఆస్పత్రిలో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తూ, వ్యాధి ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తూ, జీవిత కాలం పెంచేందుకు ఏఆర్‌టీ మందులను ఐసీటీసీ కౌన్సిలర్ నీలారపు అశోక్‌కుమార్ అందిస్తున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఫ్లోరెన్స్, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ లడే రమేశ్, పారా మెడికల్ సిబ్బంది అభినందించారు.

'ఎస్‌ఆర్‌ఆర్' చేయూతతో పంటకాల్వకు మరమ్మతు



రాయపర్తి : ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి చేయూతతో మండలంలోని మైలారం గ్రామంలోని పంట కాల్వ మరమ్మతుకు నోచుకుంది. గ్రామంలోని పంటకాల్వ పూడుకుపోవడంతో రాళ్లపాలెం, బుర్రుపంపు పొలాలకు నీరందని దుస్థితిలో రైతులు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డిని ఆశ్రయించారు. ఆయన వెంటనే స్పందించి రూ.20 వేల నగదు అందజేసి మరమ్మతు చేయించాలని చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం పంట కాల్వకు మరమ్మతు పనులు చేపట్టారు. పనులను రైతులు గాడిపెల్లి రాములు, గూడెల్లి వెంకన్న, ఐత కొమురయ్య, మైసయ్య, యాకయ్య, తదితరులు పర్యవేక్షించారు.

సింహగర్జనకు తరలిన మాల కులస్తులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నల్లబెల్లి, రాయపర్తి, పర్వతగిరి, నెక్కొండ, దుగ్గొండి, తదితర మండలాల నుంచి మాల కులస్తులు హైదరాబాద్‌లో ఆదివారం జరగనున్న మాలల సింహగర్జనకు సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ మాల మహానాడు నాయకులు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

అభివృద్ధి, సంక్షేమంపై అవగాహన పెంచుకోవాలి



ఖానాపురం : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ సాంస్కృతిక సారథి నర్సంపేట టీం లీడర్ నెల్లుట్ల సుమన్ తెలిపారు. మండలంలోని బుధరావుపేట, ధర్మరావుపేట గ్రామాల్లో పాటల ద్వారా సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజలను ఆదివారం చైతన్యవంతం చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడచిన క్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసేలా ప్రదర్శనలు ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు తాళ్ల సునీల్, యోచన, రాజేందర్, బాబు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘననివాళి



నర్సంపేట : పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో తెలంగాణ ఉద్యమకారుడు పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేటలోని అమరువీరుల స్తూపం వద్ద కిష్టయ్య చిత్రపటానికి ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, గౌరవ అధ్యక్షుడు జినుకల కొమ్మాలు, జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, తదితరులు ఘనంగా నివాళులర్పించారు. నల్లబెల్లిలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సాంబ రావు, ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య నివాళులర్పించారు. ముదిరాజ్ మహా సభ ఆధ్వర్యంలో దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో, వర్ధన్నపేటలోని కమ్యూనిటీ హాల్‌లో, రాయపర్తిలో కిష్టయ్య చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు.

పోరాటాలతోనే కార్మికుల హక్కుల సాధన

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దయాకర్



ర్యాలీలో దయాకర్, నాయకులు, కార్మికులు

నల్లబెల్లి : పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధించుకోగలమని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ తెలిపారు. మండలంలోని నారక్కపేటలో ప్రదీప్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి దయాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేల కోట్ల రూపాయల కార్మికుల సంక్షేమ నిధిని రాష్ట్ర ప్రభుత్వం ఇతర రంగాలను మళ్లిస్తూ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. కార్మికుల సంక్షేమ బోర్డును ఎత్తివేసేలా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆందోళన వెలిబుచ్చారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. హక్కులను కాపాడుకునే దిశగా నిర్వహించనున్న ఉత్యమాలకు కార్మికులు సిద్ధం కావాలని కోరారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఐఎఫ్‌టీయూ నర్సంపేట ఏరియా కమిటీ అధ్యక్షుడు బరిగెల కుమార్, నాయకులు కందకట్ల మురళి, చెన్నమల మొగిలి, కోడూరి రాజు, పెసర కుమారస్వామి, కావటి శ్రీను, దార కనకయ్య, చెన్నమల ఆలోచన, దార శంకర్, మల్లయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.